క్లుప్తంగా

బీజేపీలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీటీసీ అరిగెల

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీలకు చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డుసభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంగళవారం జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ ఆధ్వర్యంలో తన నివాసంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లిఖార్జున్‌లు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గెడం నగేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, విలాస్, స్వామి, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి'



ప్రచారం నిర్వహిస్తున్న సుధాకర్ రావు

పెంచికల్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గొడం నగేశ్‌కు భారీ మెజారిటీ అందించాలని మాజీ జెడ్పీటీసీ బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని అగర్‌గూడ, కమ్మర్‌గాం, మురళీగూడ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. మధుకర్, నగేశ్, సత్తన్న, రాజన్న, కిషన్‌రావు, అనంతరావు ఉన్నారు.

వైన్స్ సీజ్



వైన్స్‌ను సీజ్ చేస్తున్న పోలీసులు

బెజ్జూర్: రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ నివేదికల ఆధారంగా బెజ్జూర్‌లోని శ్రీనిధి వైన్స్‌ను సీజ్ చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీనిధి వైన్స్‌ను కాగజ్‌నగర్ ఎక్సైజ్ ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు హుస్సేన్, మండల్‌లు సీజ్ చేశారు. వైన్స్‌లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చే వరకు వైన్స్ తెరిచేది లేదని స్పష్టం చేశారు.

'సీఎం సభ విజయవంతం చేయాలి'

కెరమెరి: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 2న జిల్లాకు రానున్న సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి ప్రజలను తరలించాలని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, నాయకులు శ్యాంనాయక్, గజేందర్, మునీర్‌అహ్మద్, కుసుంబ్‌రావు ఉన్నారు.

నేడు ఎన్నికల ప్రచార సభ

కౌటాల: మండల కేంద్రంలోని జగదాంబ గార్డెన్‌లో బుధవారం ఎంపీ ఎన్నికల ప్రచార బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సభకు రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతారన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న మిలింద్ కుమార్

రెబ్బెన: ప్రైవేటు ఫర్టిలైజర్ షాపుల్లో అధిక ధరలకు ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ మిలింద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే ప్రతీ రైతుకు తప్పనిసరిగా రశీదులు అందించాలని సూచించారు. నకిలీ విత్తనాలు, మందులు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యవసాయాధికారి మంజుల పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో ప్రభంజనం

తిర్యాణి విద్యార్థుల ప్రతిభ



వైష్ణవి, 9.3 జీపీఏ

తిర్యాణి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల విద్యార్థులు ప్రతిభ చూపారు. మండలంలో 252 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 229మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 90శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండల కేంద్రంలోని గిరిజన గురుకులంలో 60 మంది విద్యార్థులకు 58, జెడ్పీ పాఠశాలలో 39 మందికి 36, పంగిడి మాదర ఆశ్రమ పాఠశాలలో 14 మందికి 12, గిన్నెదరి ఆశ్రమ పాఠశాలలో 32 మందికి 29, మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో 32 మందికి 27, రొంపెల్లి ఆశ్రమ పాఠశాలలో 44 మందికి 38 మంది, చెలిమల ఆశ్రమ పాఠశాలలో 44 మందికి 38, కేజీబీవీ విద్యాలయంలో 15 మంది విద్యార్థులకు 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కాగా గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన వైష్ణవి అనే విద్యార్థిని 9.3 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచింది.

పెంచికల్‌పేట్‌లో..



గ్యార అలేఖ్య　దుర్గం నీల్‌కుమార్

పెంచికల్‌పేట్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. జెడ్పీఎస్ఎస్, పెంచికల్‌పేట్‌లో 57 మంది విద్యార్థులకు గాను 50 మంది, జెడ్పీఎస్ఎస్ చేడ్వాయిలో 26 మందికి 24 మంది, కేజీబీవీలో 32 మందికి 31, ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో 16 మందికి 16 మంది, కమ్మర్‌గాం ఆశ్రమ పాఠశాలలో 12 మందికి 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీకి చెందిన గ్యారె అలేఖ్య, ఎల్లూర్ ఆశ్రమ పాఠశాల దుర్గం నీల్‌కుమార్ 9 జీపీఏ సాధించారు.

66శాతం ఉత్తీర్ణత..



నోమిక　నారాయణ　నరిగే అశోక్

కౌటాల: పదో తరగతి వార్షిక ఫలితాల్లో మండల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మండల కేంద్రంలోని మయూరి ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న కౌటాలకు చెందిన డోంగ్రి నోమిక 9.5 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ముత్తంపేట్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న చౌదరి నారాయణ 8.7 జీపీఏ, నరిగే అశోక్ 8.7 జీపీఏ సాధించారు. మండల వ్యాప్తంగా 230 మంది విద్యార్థులకు 152 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో కేవలం 66శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పెరిగిన ఉత్తీర్ణత..



యోగిత, 9 జీపీఏ　రవళిక, 9 జీపీఏ

కెరమెరి: మండలంలోని విద్యార్థులు గతేడాది పదో తరగతి ఫలితాల్లో 45శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 95శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో 295 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 284 మంది ఉత్తీర్ణులై 96శాతంగా నమోదైంది. ఝరిలోని ప్రభుత్వ పాఠశాల, రాంజీగూడ ఆశ్రమ పాఠశాలతో పాటు హట్టిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్లుగా కెరమెరి ఉన్నత పాఠశాలకు చెందిన రవళిక (9 జీపీఏ), కేజీబీవీకి చెందిన యోగిత (9జీపీఏ) సాధించారు. గతేడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరగడంతో ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, ఎంఈవో సుధాకర్, ఎంఎన్వో ఆడే ప్రకాశ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

తగ్గిన ఉత్తీర్ణత శాతం



చప్పిడి మహతి　మర్రి వీణ　ఓడిలా అనిల్

దహెగాం: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో 269 మంది విద్యార్థులకు గాను 170 మంది ఉత్తీర్ణత పొందగా, 63శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. గత సంవత్సరం మండలంలో 72 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ ఏడాది తగ్గింది. ప్రైవేటు పాఠశాలకు చెందిన చప్పిడి మహతి 9.3 జీపీఏ సాధించగా, చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మర్రి వీణ, ఒడిలా అనిల్ 8.8 జీపీఏ సాధించారు. కేజీబీవీలో 82శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మెరుగైన ఫలితాలు..



షణ్ముఖప్రియ　జాహ్నవి　నంది అక్షిత



పిండే హారిక　పుప్పాల దీప్తి

రెబ్బెన: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు 85.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 411 మంది విద్యార్థులు హాజరు కాగా 352 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌గా మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలకు చెందిన కే.షణ్ముఖప్రియ 9.7 జీపీఏ మార్కులతో టాపర్‌గా నిలిచింది. తుంగెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.సంజన 9.5 జీపీఏ, కస్తూరిబా విద్యాలయానికి చెందిన ఎస్.అక్షిత, దీప్తి, హారికలు 9.3 జీపీఏ సాధించారు. మండలంలోని నంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి.

సత్తా చాటిన 'కృష్ణవేణి' విద్యార్థులు



తన్వీన్ సాదప్, 10 జీపీఏ　ఆర్యన్, 10 జీపీఏ　శివరాజేశ్, 10 జీపీఏ　హసిని, 9.8 జీపీఏ　విష్ణుప్రియ 9.8 జీపీఏ　చందనప్రియ, 9.8 జీపీఏ

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు మంగళవారం ప్రకటించిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో సత్తా చాటారు. పాఠశాలలోని మొత్తం 56 మంది పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ముగ్గురు విద్యార్థులు 10జీపీఏ సాధించగా, ముగ్గురు 9.8, ఇద్దరు 9.7, ఒక్కరు 9.5 జీపీఏ సాధించారు.

లింగాపూర్‌లో..



పవన్‌కల్యాణ్

లింగాపూర్: పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు సత్తా చాటారు. మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో సైతం 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో సుధాకర్ తెలిపారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉత్తీర్ణత 92శాతంగా నమోదైంది. మండల కేంద్రానికి చెందిన జాదవ్ పవన్ కల్యాణ్, పుర్కె పూజలు 9.2శాతం జీపీఏ సాధించి టాపర్లుగా నిలిచారు.

కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

పెంచికల్‌పేట్: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు చౌదరి తిరుపతి, బండు, జాజిమొగ్గ శ్రీనివాస్, సముద్రాల రాజన్న, సాజీద్, సంజీవ్, ఖైరాత్, లచ్చన్న, చౌదరి శ్రీనివాస్, దుర్గం రాజన్న తదితరులు ఉన్నారు.

'ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న దుర్గం దినకర్

ఆసిఫాబాద్అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన వైద్యులు అందుబాటులో లేకున్నా ధనార్జనే ధ్యేయంగా ఇష్టానుసారంగా ఆసుపత్రులు ఏర్పాటు చేసి రోగుల ప్రాణాలు పోయేందుకు కారకులవుతున్నారని ఆరోపించారు. వెంటనే జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, నాయకులు దుర్గం నిఖిల్, జాడి తిరుపతి తదితరులు ఉన్నారు.

మోటర్ ఎత్తుకెళ్లిన దొంగలు

కౌటాల: మండలంలోని గిన్నెలహెట్టి గ్రామానికి చెందిన ఇట్యాల రమేశ్ అనే రైతు వ్యవసాయ పొలంలోని బోర్ మోటర్‌ను సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో బోర్‌కు అమర్చిఉన్న విద్యుత్ మోటర్‌తో పాటు విద్యుత్ సరఫరా తీగను సైతం దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని రైతు తెలిపాడు.

సీపీవో సేవలు అభినందనీయం



రవీందర్ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి బంగారి రవీందర్ సేవలు అభినందనీయమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సీపీవో పదవీ విరమణ పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి సీపీవో దంపతులను శాలువతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల రెండు నెలల పాటు సీపీవో రవీందర్ జిల్లా అభివృద్ధికోసం కీలకమైన ప్రణాళికలు రూపొందించారన్నారు. నిత్యం కార్యాలయంలో అందుబాటులో ఉంటూ అధికారుల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రవీందర్ గత శాసనసభ ఎన్నికల్లో సీవిజిల్ నోడల్ అధికారిగా వ్యవహరించి, ఫిర్యాదులపై వెంటనే స్పందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీవో పాపయ్య, ఏఎస్‌వో గురువయ్య, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాసరి ప్రతిభా అవార్డుకు ఎంపిక



సురేశ్ కుమార్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన బుల్లితెర దర్శకనిర్మాత నాగబాల సురేశ్ కుమార్ 'దాసరి ప్రతిభా' అవార్డుకు ఎంపికయ్యారు. పలు టీవీ సీరియల్స్‌కు దర్శకనిర్మాతగా వ్యవహరించిన ఆయన.. అనతి కాలంలోనే టీవీ ఫెడరేషన్ ఏర్పాటు చేసి దాతల సహకారంతో ఫెడరేషన్‌కు సొంత భవన నిర్మాణం చేపట్టారు. ఇప్పటివరకు 13 నంది అవార్డులు అందుకోగా.. తాజాగా దాసరి ప్రతిభా అవార్డు ఆయనను వరించింది. హైదరాబాద్‌లోని ప్రసాద్ లాబ్స్ వద్ద బుధవారం సాయంత్రం 5 గంటలకు అవార్డు కమిటీ సభ్యుల చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలుగు దర్శకుల సంఘం, 'మా' అసోసియేషన్ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సౌజన్యంతో అవార్డు ప్రదానం చేయనున్నారు. అవార్డు కమిటీలో సభ్యులుగా తమ్మారెడ్డి భరద్వాజ, సి.కళ్యాణ్, రేలంగి నరసింహారావు, జర్నలిస్టు ప్రభు, దాసరి ప్రభు, దాసరి అరుణ్‌కుమార్, డాక్టర్ రఘునాథబాబు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఎన్నికల ప్రచారం



కెరమెరి: ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పెంచికల్‌పేట్: మండలంలోని జైహింద్‌పూర్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు బీఆర్ఎస్ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాచకొండ కృష్ణ, ఎల్కరి సుధాకర్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

కెరమెరి: అన్ని వర్గాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మగూడ, ఝరి, మోడి గ్రామాల్లో వేర్వేరుగా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి సక్కును గెలిపించాలని కోరారు. న్యానేశ్, ఇసాక్, అశోక్, దస్తగిరి, గన్నాథ్‌రావు, గుణవంత్‌రావు, అంబాజీ, భరత్, భీంరావు తదితరులు ఉన్నారు.

'మేడే ఘనంగా జరుపుకొందాం'



మేడే పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ రావు

రెబ్బెన: కార్మిక హక్కుల సాధన కోసం 138వ కార్మిక దినోత్సవాన్ని బెల్లంపల్లి ఏరియాలో ఘనంగా జరుపుకుందామని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం గోలేటిలోని యూనియన్ కార్యాలయం వద్ద మేడే పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనులను సింగరేణికి నామినేటెడ్ పద్ధతిలో కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు మంగీలాల్, రాజేశం, శ్రీనివాస్, గణపతి, మల్లయ్య పాల్గొన్నారు.

టీఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో..

గోలేటి టౌన్‌షిప్‌లోని టీఎస్‌టీయూసీ కార్యాలయంతో పాటు ఏరియాలోని గనులపై మంగళవారం టీఎస్‌టీయూసీ నాయకులు మేడే వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్, నాయకులు నారాయణ, ఎండీ హసన్, మల్లయ్య, తిరుపతి, చంద్రమౌళి, నవీన్‌కుమార్, పాండే, ఖాసీం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా నిలిచిన వంతెన పనులు

- ఏళ్లుగా పెండింగ్‌లోనే అమీన్‌గూడ వంతెన పనులు
- వానాకాలంలో వాగు దాటేందుకు తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అసంపూర్తిగా ఉన్న అమీన్‌గూడ వంతెన

తిర్యాణి: మండలంలోని తెలండి పంచాయతీ పరిధి అమీన్‌గూడ గ్రామశివారులోని వాగుపై వంతెన నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్) ద్వారా రూ1.50 కోట్లు మంజూరు చేశారు. దీంతో కాంట్రాక్ట్ దక్కించుకున్న గుత్తేదారు గతంలోనే పనులు ప్రారంభించాడు. పిల్లర్ల స్థాయి వరకు పనులు చేపట్టి వివిధ కారణాలతో నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో వంతెన నిర్మాణంతో తమ రాకపోకల సమస్యలు తీరుతాయని భావించిన సమీప గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది.

తప్పని ఇబ్బందులు

వంతెన నిర్మాణ పనులు ఏళ్లుగా అసంపూర్తిగానే ఉండటంతో వర్షాకాలంలో వాగును దాటేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. వంతెన పనులు పూర్తయితే తెలండి నుంచి అమీన్‌గూడ, కోయ తెలండి గ్రామాలకు నేరుగా రవాణా సౌకర్యం కలుగుతుంది. వంతెన లేకపోవడంతో వానాకాలంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యావసర సరుకుల కొనుగోలు, పింఛన్, వ్యవసాయ పనిముట్లు, ఎరువుల కొనుగోలు, వైద్యం తదితర అవసరాల కోసం ఉధృతంగా ప్రవహించే వాగును దాటేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగుకు అవతలి వైపున తెలండి, పెర్కపెల్లి గ్రామాలకు చెందిన రైతులకు అమీన్‌గూడలో సాగు భూములు ఉన్నాయి. కొన్ని రోజుల పాటు వాగు ఉప్పొంగుతుండడంతో పంట పొలాలకు వెళ్లలేకపోతున్నారు. సమస్యలను దృష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎండాకాలంలోనే అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. వర్షాకాలంలోపు వంతెనను అందుబాటులోకి తెచ్చేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

వానాకాలంలోపే పనులు పూర్తి చేయాలి



అమీన్‌గూడలో ఉన్న సాగు భూముల్లో వ్యవసాయం చేసేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఒక్కోసారి రోజుల తరబడి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పంట చేలకు వెళ్లలేకపోతున్నాం. వర్షాలు పడకముందే పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

– పులి వెంకటేశ్, తెలండి

బీఆర్ఎస్‌లో చేరిన సద్దాం హుస్సేన్



బీఆర్ఎస్‌లో చేరిన సద్దాం హుస్సేన్, నాయకులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ నివాసంలో మంగళవారం కాగజ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ గిరిశ్‌కుమార్, దహెగం మాజీ జెడ్పీటీసీ పిల్లల తిరుపతి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్సీ పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు కృషి చేయాలన్నారు. ప్రతీ కార్యకర్త ప్రతీ ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నాయకులు ముహిన్, తదితరులు ఉన్నారు.